క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు దుగ్గిరాల గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాల, రేవేంద్రపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ క్యాంప్ జరుగుతుందని పేర్కొన్నారు. నూతన ఆధార్ కార్డు, సవరణలు, ఫోన్ నంబరు, పాన్ అనుసంధానం తదితర సేవలు అందజేస్తారని తెలిపారు.

మంగళగిరి: నగర పరిధిలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ అలీం బాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో క్యాంపులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు సచివాలయ సెంటర్లలో ప్రత్యేక సిబ్బంది నియమించడం జరిగిందని తెలిపారు. 22వ తేదీ వరకు తొలి దశ, రెండో దశ 26 నుంచి 29వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు.

మహిళపై అత్తమామల దాడి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో నివాసముండే టీడీపీ మహిళా కార్యకర్తపై అత్తింటి వారు దాడి చేసిన ఘటనపై ఆ పార్టీ ఉండవల్లి నాయకులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు మౌనిక మాట్లాడుతూ భర్తతో కలసి అత్త మామ తరచూ తనపై దాడి చేస్తున్నారని తెలిపారు. కృష్ణానది తీరంలో అత్తమామలు పూజా సామగ్రి విక్రయిస్తుంటారని, తాను కూడా అక్కడే మరో షాపు పెట్టుకున్నట్లు చెప్పారు. దీంతో ఆగ్రహించిన మామ గుణశేఖర్, అత్త పలు మార్లు తనపై దాడి చేశారని వివరించారు. భర్త కూడా పలుమార్లు దాడి చేసినట్లు ఆమె తెలిపారు. ఈ ఘటనను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

కరకట్ట వెంబడి ఫ్లెక్సీల తొలగింపు



తాడేపల్లిరూరల్: కృష్ణానది ఎగువ ప్రాంతంలోని అమరావతి కరకట్ట వెంబడి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ అధికారులు సోమవారం తెల్లవారు జామున ఫ్లెక్సీలు, అనధికారిక హోర్డింగ్‌లు తొలగించారు. నిత్యం ఈ రహదారిలో వీవీఐపీలు తిరగడం, అంతా ఖాళీ ప్రదేశం కావడంతో ఈదురు గాలుల వల్ల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పడిపోతున్నాయి. దీంతో అనధికార హోర్డింగ్‌లు తొలగించాలని కమిషనర్ అలీమ్‌బాషా ఆదేశాలు జారీ చేశారు. ఫ్లెక్సీలతో పాటు హోర్డింగ్‌లను కూడా వెల్డింగ్ మిషన్‌లతో కట్ చేసి, తొలగించారు.

అఘోరీ హల్‌చల్

మంగళగిరి : మంగళగిరి – తాడేపల్లి జాతీయ రహదారిపై ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన మహిళా అఘోరీ సోమవారం హల్‌చల్ చేసింది. పుర్రెలు మెడలో ధరించి, దిగంబరంగా ఆటో నగర్‌లోని తన కారు సర్వీస్ సెంటర్‌కు వెళ్లింది. కారు సర్వీసు చేస్తుండగా ఓ జర్నలిస్టు అఘోరీని ఫొటో తీశారు. దీంతో ఆగ్రహించిన అఘోరీ జర్నలిస్టుపై దాడి చేసి, గాయపరచింది. అతడు ఎన్‌ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంతలో మరికొంత మంది జర్నలిస్టులు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీయడంతో పాటు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు చేరుకుని అఘోరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీదేవి బాధ్యతలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాయలంలో ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ సహకార సంస్థ చైర్మన్‌గా ఉండవల్లి శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు, పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. తనక ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని తెలిపారు.

రేపు పరిచయ కార్యక్రమం

తాడికొండ: వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమం గుంటూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమన్వయకర్తగా వనమా బాల వజ్రబాబుతో పరిచయం ఉంటుందన్నారు. గుంటూరు రామా బిల్డింగ్ ఎదురుగల మల్లికార్జునపేట 5వ లైనులోని కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాయంత్రం 4 గంటలకు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో సొంత నిధులతో మసీదు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. నూతన నిర్మాణం నిమిత్తం తన తండ్రి మొహమ్మద్ అన్వర్ అలి పేరుతో సొంత స్థలం ఇచ్చి తామే నిర్మిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో మసీదు నిర్మాణం చేయాలని తాము తలచి సొంత నిధులు వెచ్చించి నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాష, అన్వర్, ఫిరోజ్, ముస్లిం మత పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



అర్జీ అందజేస్తున్న సీపీఐ నేతలు



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయికులు

అర్జీలు సమర్పించిన సీపీఐ నేతలు

తాడేపల్లిరూరల్: పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళగిరి సీపీఐ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య కోరారు. సోమవారం పేదల నుంచి సంతకాలు సేకరించి, ఉండవల్లి సెంటర్‌లోని 14వ సచివాలయంలో అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లోని పేదలకు 2 సెంట్లు, గ్రామాల్లోని పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇళ్లను తామే నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. గృహ నిర్మాణ వ్యయం పెరిగిందని, అందుకు తగ్గట్లుగా నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంట్, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, శీలం శ్యామ్, శీలం అనిల్, సీపీఎం నాయకులు వెంకయ్య, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయాలి

తాడికొండ: పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వారిని ఆదుకోవాలని సీపీఐ తాడికొండ నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ పొన్నెకల్లు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. గ్రామీణ పేదలకు మూడు సెంట్లు స్థలాన్ని ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలులో భాగంగా పేదలకు త్వరితగతిన ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి షేక్ జానికి ఇళ్ల స్థలాల అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామంలో మంచినీటి కొరతను తీర్చాలని మరో అర్జీ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో శబరిమల యాత్ర

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండల పరిధిలోని అయ్యప్పలు సోమవారం శబరిమల యాత్రకు సిద్ధమయ్యారు. 40 రోజుల పాటు కఠోర దీక్ష చేసి, ఇరుముడులను భక్తిశ్రద్ధలతో కట్టుకుని, అయ్యప్ప భజనలతో ఈ యాత్రను ప్రారంభించారు. ఈమని గ్రామంలో గురుస్వామి కోసూరి శంకరరావు ఆధ్వర్యంలో 40 మంది అయ్యప్ప భక్తులు ఉదయం నుంచి స్వామి విగ్రహానికి అన్నాభిషేకం, పాలాభిషేకంతో పాటు పలు రకాల పూజలు నిర్వహించారు. శబరిమల బయలు దేరారు. ఉండవల్లి సెంటర్, సీతానగరం, తాడేపల్లి గేటు సెంటర్ వద్ద ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానాల నుంచి గురుస్వామి గోవిందరాజు, చిరంజీవి తదితరుల ఆధ్వర్యంలో శబరిమలకు అయ్యప్ప భక్తులు బయలు దేరారు. ఈమని, తాడేపల్లి గేటు సెంటర్ వద్ద అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈమనిలో శబరిమల యాత్రకు బయలుదేరిన అయ్యప్పలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాడికొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం జరిగింది. తాడికొండ సీఐ వాసు వివరాల మేరకు.. పాటిబండ్ల గ్రామానికి చెందిన మన్నవ లూర్దురాజు తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. వెనుకగా వచ్చిన టాటాఏస్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో లూర్దురాజుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు. కంతేరు గ్రామానికి చెందిన బోడా రాణి అనే మహిళ ఈ నెల 15న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. భర్త, బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకి లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మున్సిపల్ స్థలాన్ని ఖాళీ చేయండి

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: మహాత్మా గాంధీ కూరగాయాల మార్కెట్ కాంప్లెక్స్‌ను అక్రమించుకుని కొందరూ వ్యాపారులు చేస్తున్నారని, వెంటనే వారు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ మార్కెట్ వద్ద సోమవారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది వ్యాపారులు అనధికారకంగా అక్కడ వ్యాపారం చేసుకోంటున్నారని తెలిపారు. షాపులు దక్కించుకున్న మరికొందరూ వ్యాపారులు మున్సిపల్ స్థలంలో వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. తమకు కేటాయించిన షాపుల్లో వ్యాపారాలు చేసుకోవాలని, ముందుకు జరిగితే సహించేది లేదన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయం శిధిలావస్థకు వచ్చిందని, త్వరలో మార్కెట్‌పై అంతస్థుకు దానిని మార్చనున్నట్లు చెప్పారు. పై అంతస్థుకు వెళ్ళే మెట్లను రాకపోకలకు అనువుగా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఆర్వో రాంప్రసాద్, ఏసీపీ శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిసనర్

మురుగును వెంటనే తొలగించండి

తెనాలిఅర్బన్: మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయకపోవడం వలన ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 13,14 వార్డులలో సోమవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి ఆమె సూచనలు చేశారు. అలాగే పిచ్చిమొక్కలు మొలవడాన్ని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. కాల్వలను బాగు చేసి ఎన్నిరోజులు అయిదంటూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్రా సుజాత, దాసరి వీరవసంతరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఎతఈ సూరి బాబు, పాల్గొన్నారు.

24 గంటల్లో మహిళ ఆచూకీ లభ్యం

తాడికొండ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ ఆచూకి 24 గంటల్లో ఛేదించి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన తాడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తాడికొండ గ్రామానికి చెందిన కె.సాంబ్రాజ్యం కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 17న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె సోదరుడు యశోదరావు తాడికొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా, స్పందించిన పోలీసులు వెంటనే ఫోన్ ట్రాక్ ఆధారంగా మహిళ విజయవాడ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. సోమవారం ఉదయం అక్కడ నుంచి పోలీసులు తాడికొండ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంటనే స్పందించి, తన సోదరి ఆచూకి తెలుసుకున్న జిల్లా ఎస్పీ, తాడికొండ సీఐ, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన



పాల్గొన్న అధికారులు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సోమవారం అడిషనల్ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు రీజినల్ ఆఫీసర్ సీహెచ్ ఆదినారాయణ పాల్గొన్నారు ఎస్సీ, ఎస్టీలు తమ హక్కులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జి.పూర్ణచంద్రరావు, ఎస్.వెంకటేశ్వరరావు, ప్రసాద్ రావు, గోపాల లక్ష్మయ్య, పిల్లి రాజు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలుకు డిమాండ్

తెనాలి: కేంద్రప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం వినతిపత్రాన్ని సోమవారం సబ్‌కలెక్టర్ వి.సంజనారెడ్డికి అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గతేడాది ఎకరానికి ధాన్యం దిగుబడి 40 బస్తాలు కాగా, ఈసంవత్సరం 30 బస్తాలకు పడిపోయిందన్నారు. గతేడాది 75 కిలోల బస్తా ధర రూ.1800 ఉంటే, ప్రస్తుతం రూ.1400- 1470లకు మించి కొనుగోలు చేయడటం లేదన్నారు. దీంతో రైతులు, కౌలురైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పంట దిగుబడి ఆరంభంలోనే ఇలా ఉంటే, ముమ్మరంగా హార్వెస్ట్ జరిగితే ధర ఏవిధంగా ఉంటుందోనని అన్నారు. మరోవైపు మార్కెట్లో... 26 కిలోల బియ్యం రూ.1600-1700లకు అమ్మకాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాలు ధాన్యం ధర రూ.2320, 75 కిలోల బస్తా రూ.1740లకు కొనుగోలు జరుగుతున్నందున రైతులు ఎకరాకు రూ.8 వేలు నష్టపోతున్నారని శివ సాంబిరెడ్డి విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయిస్, రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



సబ్ కలెక్టర్ సంజనా సింహకు వినతిపత్రం అందజేస్తున్న శివసాంబిరెడ్డి

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

మేడికొండూరు: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామం వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న పదిమంది కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఫిరంగిపురం మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ప్రమాదంలో ఆటోలో ఉన్న పది మందికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోజువారి కూలీల ఆటో ప్రమాదానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన కూలీలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



బోల్తాపడి కూలీల ఆటో

మహిళను మోసం చేసిన ఘటనపై ఫిర్యాదు!

పట్నంబజారు: మహిళను ఏమార్చి ఏటీఎంలో నగదు డ్రా చేస్తున్న ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వివరాలు.. లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఏటుకూరు రోడ్డు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ హిందూ కళాశాల సమీపంలోని ఓ ఏటీఎం సెంటర్ వద్దకు బ్యాంకులో డబ్బులు విత్‌డ్రా కోసం వచ్చారు. అక్కడ ఉన్న ఓ వ్యక్తి సదరు మహిళకు సాయం చేస్తానని చెప్పి పిన్‌నంబరు అడిగాడు. ఆమె కార్డుకు డబ్బులు రావడం లేదని నమ్మించి అతడి వద్ద ఉన్న నకిలీ ఏటీఎం కార్డు ఆమెకు ఇచ్చి పంపించివేశాడు. ఆమె వెళ్లినట్లు నిర్ధారించుకున్న తరువాత ఆ అకౌంట్ నుంచి రూ.50 వేలు విత్‌డ్రా చేశాడు. నగదు విత్‌డ్రా కావడంతో సదరు మహిళ సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీనిపై లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు.

ఎయిమ్స్ రహదారిలో దుమ్మూ ధూళి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఎయిమ్స్ రహదారిలో కొలనుకొండ వద్ద ఉన్న పలు రెడీమిక్స్ ఫ్యాక్టరీ నుంచి దుమ్మూ ధూళి భారీగా వెలువడుతోందని స్థానికులు చెబుతున్నారు. సోమవారం తెల్లవారుజామున ఎన్నడూ లేనివిధంగా ఒక్కసారిగా రెడీమిక్స్ ఫ్యాక్టరీ నుంచి వెలువడిన దుమ్మూ ధూళి కారణంగా ఎయిమ్స్ రోడ్డుతో పాటు మిగిలిన రహదారులన్నీ దుమ్ముతో నిండిపోయాయి. అక్కడ నివసించే ప్రజలు, ప్రయాణికులు ఏదో ప్రమాదం జరిగిందని 100కు సమాచారం ఇచ్చారు. ఒక పక్క హాస్పిటల్ మరో పక్క పలు ప్రభుత్వ కార్యాలయాలు.. ఆ పక్కనే మున్సిపాలిటీ రాష్ట్ర కార్యాలయం ఉన్నా ఏ అధికారీ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు.



రెడీమిక్స్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు

ఇళ్ల మధ్య మేకల పెంపకంతో ఇబ్బందులు

తెనాలిరూరల్: ఇళ్ల మధ్యలో మేకలను పెంచుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవడంతో పాటు అనారోగ్యం బారిన పడుతున్నామని మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పూర్ణప్రజ్ఞాచారి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కోడూరు వెంకయ్య అలియాస్ జోసఫ్ తమ ఇళ్ల వద్ద మేకల పెంపకం చేపట్టాడని, దీనివల్ల తమ కుటుంబ సభ్యులందరూ అనారోగ్యం బారిన పడినట్టు తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. మేకలను ఇతర ప్రాంతంలో పెంచుకోవాలని అడిగితే తమపై దాడి చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆయనకు తెలిపారు.

రైతులతో చర్చించాకే భూ సేకరణ

తాడికొండ: రైల్వే లైను భూ సేకరణకు రైతులతో గ్రామ సభలు నిర్వహించి, చర్చించి పరిహారం ఎంత ఇస్తారో చెప్పిన తర్వాతే గ్రామాల్లో పెగ్‌మార్క్ సర్వే నిర్వహించాలని తాడికొండ రైల్వే లైను భూసేకరణ బాధితులు కోరారు. సోమవారం తాడికొండ తహసీల్దారు కె.నాసరయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ భూసేకరణ ద్వారా తాము తరతరాల నుంచి వస్తున్న భూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. అయితే భూములు ఇచ్చేందుకు తమని సంప్రదించి గ్రామ సభలు నిర్వహించి, ఎంత పరిహారం ఇస్తారో కూడా తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పంట పొలాల్లో పెగ్‌మార్క్ సర్వే నిర్వహిస్తూ అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారులను గ్రామ సభలు నిర్వహించాలని కోరామని, కానీ, ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. రైతులతో గ్రామ సభలు నిర్వహించి ఎంత పరిహారం ఇస్తారనేది తెలియజేసి, పొలాల్లోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

చలో గుంటూరును జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్ : అఖిల భారత రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లో నవంబర్ 26న నిర్వహించనున్న నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులు జొన్న శివశంకరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కంచర్ల కాశయ్య, రైతు సంఘం నాయకుడు దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేసి, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. గుంటూరులోని శంకర్ విలాస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగే నిరసన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎన్నికలకు ముందు మంత్రి నారా లోకేష్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఈ మేరకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కె. ఆదినారాయణ, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కె.స్టీవెన్, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు, కొట్టే కరుణాకర్‌రావు, శ్రీనివాస్ రెడ్డి, విజయ్‌బాబు, ఆశీర్వాదం, అంకయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పద్య పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



ముగ్గులేస్తున్న విద్యార్థినులు

తాడేపల్లిరూరల్ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయ అధికారి నాగూర్ బాషా తాడేపల్లి శాఖ గ్రంథాలయంలో జూనియర్స్ విభాగంలో పద్య పోటీలు, సీనియర్స్ విభాగంలో ప్రస్తుత యుద్ధ పరిస్థితులు, 3వ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించామని తెలిపారు. సుమారు 52 మంది విద్యార్థులు పాల్గొనగా, ఉపాధ్యాయులు కె.సాయివైష్ణవి, టి.ధనలక్ష్మి, టి.యామిని, టి.స్వర్ణలత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారని చెప్పారు.

■ **తాడికొండ:** తుళ్లూరు గ్రంథాలయంలో విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. ముగింపు రోజు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయ అధికారి టి.గిరిధర్‌కుమార్ తెలిపారు.

■ **ఫిరంగిపురం:** మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు. న్యాయ నిర్ణయతగా గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ బాబు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సైదా సాహెబ్ డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.



నృత్య పోటీల్లో విజేతలు

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

తెనాలిరూరల్: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పట్టణ, మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని రేషన్ పంపిణీపై డీలర్లకు, యండీయూలకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల నిర్వాహకులు తమకు అందించిన సరుకులను ఖచ్చితంగా పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. ఇటీవల ఓ ఆపరేటర్ పోలీసులకు రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాను స్వయంగా రేషన్ పంపిణీని పరిశీలిస్తానని చెప్పారు. పట్టణ, మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సీఎస్‌డీటీ మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

కొళాయి కనెక్షన్ తొలగించండి

తెనాలిఅర్బన్: రక్షిత మంచినీటి పథక కుళాయి కనెక్షన్ ఉందని, దానిలో నీరు రావడం లేదని, దానిని తొలగించే విధంగా చూడాలని ఐతానగర్‌కు చెందిన దాసరి ప్రకాశరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతికి అర్జీ ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు, స్థానిక నివాసులలు పాల్గొన్నారు.